క్లుప్తంగా

చవితి పందిళ్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



నాదెండ్ల: వినాయకచవితిని పురస్కరించుకుని విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. గణపవరం గ్రామంలో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా మైక్ పర్మిషన్‌తో పాటూ విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఎత్తు, నిమజ్జన ప్రదేశం, నిమజ్జనానికి వినియోగించే వాహన వివరాలు, ఐదుగురితో కూడిన కమిటీ సభ్యుల పేర్లు, వివరాలు అందించాలన్నారు. బాణాసంచా, డీజేలు వినియోగించరాదన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తప్పనిసరన్నారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించకుండా ప్రశాంతంగా పండుగ వేడుకలు జరుపుకోవాలని కోరారు.

చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



నరసరావుపేట: మెగాస్టార్ పద్మ విభూషణ్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా బుధవారం చిరంజీవి యువత అధ్యక్షులు అద్దెపల్లి ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని విజయ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీక్లబ్ ఆంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, వాగ్దేవి విద్యాసంస్థలు సెక్రటరీ రాయల శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు అభిమానులు రక్తదానం చేశారు. అతిథులు మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ మెగాస్టార్, పద్మవిభూషణ్‌గా ఎన్నో అవార్డులు సంపాదించుకున్న నటుడు చిరంజీవి అన్నారు. ఆయన సేవా కార్యక్రమాల్లో ముందు ఉంటూ తన అభిమానుల్ని ప్రోత్సహించటం వలన సమాజానికి, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చిరంజీవిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ రక్తదానం, నేత్రదానం చేయాలని పిలుపునిచ్చారు. చిరంజీవి యువత నాయకులు కృష్ణంశెట్టి గోవిందరావు. బ్రహ్మం. గుప్తా శ్రీకాంత్. హనుమంతరావు తదితర అభిమాన సంఘ నాయకులు పాల్గొన్నారు.

సూచనలు పాటించి పంట నష్టం నివారించుకోవాలి

నాదెండ్ల: పంటలు సాగు చేసిన రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించినట్లయితే పంట నష్టం నివారించవచ్చని వ్యవసాయాధికారి శ్రీలత చెప్పారు. మండలంలోని గొరిజవోలు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించిన అనంతరం రైతు భరోసా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ముందుగా సచివాలయాల్లో ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. పత్తి తోటల్లో తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులు సూచించిన పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. తగు మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించుకోవాలన్నారు. వీటితో పాటూ తగిన మోతాదులో పురుగుమందులు వాడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదుతోనే రైతులకు ప్రయోజనాలు

యడ్లపాడు: మండలంలోని యడ్లపాడు, మైదవోలు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే మార్గాలను వివరించారు.

ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంటలలో గులాబీ రంగు పురుగు నివారణకు పంట తొలి దశలో వేప నూనె, వేప గింజల కషాయం వాడాలని సూచించారు. అలాగే ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు అమర్చుకోవడం ద్వారా పురుగుల ఉధృతిని అంచనా వేసి సమయానుకూల చర్యలు తీసుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులు వద్ద నుంచి సీసీఆర్‌సీ కార్డులు తీసుకొని ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. దీని ద్వారా కౌలు రైతులు కూడా అన్నదాత సుఖీభవ నిధులు, పంట మద్దతు ధర, పంట కొనుగోలు లబ్ధి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో జీవన్ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపి, బిలాల్, అనుపమతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఇంత నిర్దయా... మామీద!!

- యడ్లపాడు మండలంలో 170 పింఛన్లు రద్దు
- గగ్గోలు పెడుతున్న అభాగ్యులు

దిక్కుతోచని స్థితిలో దివ్యాంగులు

యడ్లపాడు: శారీరక, మానసిక లోపాలతో పోరాడుతూ.. సమాజంలో చిన్నచూపును భరిస్తూ.. ఏదో ఒక ఆసరా కోసం ఎదురుచూసే దివ్యాంగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం మరో విషాదాన్ని నింపింది. పింఛన్ రూపంలో ఉన్న కాస్త ధైర్యాన్ని కూడా లాగేసుకుని వారిని వీధిన పడేయడంతో దివ్యాంగులు తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నారు. ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు కూటమి సర్కార్ కొత్త నిబంధనలతో కొర్రీ పెడుతోంది. పుట్టుకతో పోలియో బారిన పడిన వారు, పక్షవాతంతో ఏళ్ల తరబడి బాధపడుతున్న వారు, అంధులు, కాలు, చేయి వైకల్యం ఉన్నవారు, మానసిక దివ్యాంగులు, చెవిటి, మూగవారు.. ఒక్క యడ్లపాడు మండలంలోనే రెండు వందలకు చేరువలో దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తూ నోటీసులు ఇవ్వడంపై సర్వాత్ర చర్చనీయాంశమైంది. బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

170 మంది పింఛన్లు రద్దు చేస్తూ నోటీసులు

వరుసగా ఆగస్టు 15 నుంచి మూడు రోజులు వరుస సెలవులు రావడంతో సచివాలయాలు తెరుచుకో లేదు. సోమవారం విధులకు హాజరైన సచివాలయ ఉద్యోగులు దివ్యాంగులకు ఫోన్ చేసి సచివాలయంకు పిలిపించి రీ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌లు, పింఛన్ రద్దు నోటీసులు అందజేస్తున్నారు. ఈ నోటీసుల్లో ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 170 మంది దివ్యాంగుల పింఛన్లను మండలంలో ఒకేసారి రద్దు చేయడంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నఫళంగా పింఛన్లు నిలిచిపోవడంతో



దిక్కుతోచని స్థితిలో లబోదిబో మంటున్నారు దివ్యాంగులు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

నగదు పెంపు.. పింఛన్‌దారుల సంఖ్య కుదింపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పింఛను సాయం సొమ్ముతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచుతూ వెళ్లారు. ఎన్నికల సమయంలో రూ.3 వేల పింఛన్‌ను రూ.6 వేలుగా పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అర్హులందరికీ జగనన్న పింఛను ఇచ్చారు



దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. పింఛన్ అందించలేకనే సదరం క్యాంపులను నిలిపివేసింది. వీరి ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ పొందడాన్ని సులభతరం చేసింది. అడిగిన వారందరికీ పింఛన్లు మంజూరు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

–వడ్డేపల్లి నరసింహరాజు, వైఎస్సార్‌సీపీ యడ్లపాడు మండల అధ్యక్షులు

పునఃపరిశీలనకు పంపిస్తాం



వైకల్యం శాతం ఆధారంగా దివ్యాంగ పింఛన్లు రద్దు అయిన మాట వాస్తవమే. 40శాతం పైగా ఉన్న దివ్యాంగులకు తిరిగి పింఛన్ తిరిగి వస్తుంది. అర్హత ఉండి రద్దు అయిన వారు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అప్పీల్ చేసుకుంటే వైకల్యం పునఃపరిశీలనకు పంపిస్తాం. అర్హత కలిగిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- షేక్ జాకీర్ హుస్సేన్, ఇన్‌చార్జి ఎంపీడీవో, యడ్లపాడు

మానసిక దివ్యాంగురాలు



ఈవిడ పేరు ఖరీదు రమాదేవి. ఉన్నవ గ్రామం వ్యవసాయ కూలీ కుటుంబమైన కృష్ణయ్య, సుబ్బమ్మల ముగ్గురి సంతానంలో పెద్దది. పుట్టుకతోనే బుద్ధి మాంద్యురాలు కావడంతో పసిపిల్లల మనస్తత్వం. 45 ఏళ్లు వస్తున్నా ఇంకా అవివాహితురాలిగానే మిగిలిపోయింది. ఇప్పటికీ నిత్యం ఒకరు ప్రత్యేకంగా ఆమె ఆలనాపాలనా చూడాల్సిన పరిస్థితి. దీంతో మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో పింఛన్ అందించి ఆదుకుంది. కానీ కూటమి సర్కార్ పునః పరిశీలన పేరుతో ఉన్న పింఛన్ తొలగించింది.

నడవలేడు, కూర్చోలేడు!



పుట్టుకతోనే కాళ్లు వంకరగా ఉండటంతో సరిగా నడవలేని దివ్యాంగుడు చెన్నం శివయ్య. ఇప్పుడు పెన్షన్ రద్దుతో ఆవేదనలో మునిగిపోయారు. బతుకుదెరువు కోసం స్వగ్రామం శావల్యాపురం నుంచి అత్తగారి ఊరైన చెంఘీజ్‌ఖాన్‌పేటకు వలస వచ్చిన శివయ్య, ఇప్పుడు పింఛనే తన జీవనాధారమని కన్నీరు పెట్టుకుంటున్నారు. 58 ఏళ్ల శివయ్య ఆరు నెలల క్రితం కాళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. రెండు మోకాళ్లు రాసుకుని నడవాల్సి వస్తోందని, కింద కూర్చోలేనని, ఏ పని చేయలేనని ఆయన వాపోయారు.

పుట్టుకతోనే అంధురాలు



గంథం తులసీ పుట్టుకతోనే ఒక కనుగుడ్డు లేని దివ్యాంగురాలు. నాయీ బ్రాహ్మణ కుంటుంబానికి చెందిన ఆమె భర్త శ్రీనివాసరావు మంగలి వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పనులు ఉన్నా లేకున్నా దివ్యాంగ పింఛన్‌తో జీవనం సాగిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో పింఛను మంజూరు కావడంతో ఆమె ఆనందపడ్డారు. అయితే, ప్రభుత్వం ఆమె పింఛనును రద్దు చేయడంతో తులసీ ఆందోళన చెందుతున్నారు.

నేడు పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: మండలంలోని యడవల్లి ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా పలు గ్రామాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. యడవల్లి, కట్టుబడివారిపాలెం, ఈటీ లలో ఉన్న చిన్న, భారీ పరిశ్రమలకు సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎనిమిది ట్రై సైకిళ్లు మంజూరు

శావల్యాపురం: నూరుశాతం అంగవైకల్యం కల్గినవికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లు ఎనిమిది మంజూరు అయినట్లు డిప్యూటీ ఎంపీడీవో పి.సుగుణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ కారుమంచి-01, శావల్యాపురం-01, వేల్పూరు-01,మతుకుమల్లి,-01,శానంపూడి-01, పోట్లూరు-01, గుంటుపాలెం-1, కనమర్లపూడి-01 గ్రామ పంచాయతీలకు ట్రై సైకిళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధుల సారథ్యంలో అర్హులకు ట్రై సైకిళ్లు అందజేస్తారన్నారు. అలాగే ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రపరచటానికి ప్రత్యేకంగా యంత్ర పరికరాలు కూడా ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులకు అందజేశామని పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నట్లు తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లోని నివాస గృహాల సమగ్ర వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ పొందుపరిచారని త్వరలో ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతాయన్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే బొల్లా డిమాండ్
- వర్షాలకు పంట దెబ్బతిన్నా పట్టించుకునే నాధుడే లేడు
- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

వినుకొండ: వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బొల్లాపల్లి మండలం జయంతి రామపురం, రెడ్డిపాలెం, మేళ్లవాగు, పమిడిపాడు గరికపాడు, గుమ్మనంపాడు, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, రేమిడిచర్ల గ్రామలతో పాటు ఈపూరు మండలంలో కూడా కొన్నిగ్రామాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పత్తి పంట చేతికందే దశలో పూర్తిగా పాడైపోయి రైతులు నష్టాలపాలయ్యారన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఏ పంట వేసినా కనీస మద్దతు ధర లేక రైతులు నష్టపోయి



మాట్లాడుతున్న బ్రహ్మనాయుడు

ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తోందని, మాటలు కోటలు దాటుతున్నాయి కానీ అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్న రైతులకు వర్షం రూపంలో తీవ్రనష్టం జరిగిందని, వర్షాలకు పంట దెబ్బతిని ఇబ్బందులు పడుతుంటే ఇంతవరకు ప్రభుత్వ చీఫ్‌విప్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు కానీ, స్థానిక అధికారుకు కానీ రైతుల పంటలు నష్టం తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టం అంచనావేసి రైతులకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సర్వే పనులు వేగవంతం చేయాలి

శావల్యాపురం: భవిష్యత్‌లో శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయాలు చుట్టూ తిరగకుండా ఉండటానికి ప్రభుత్వం నూతనంగా వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు తహసీల్దారు యం.అర్జున్ నాయక్ బుధవారం తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మాట్లాడుతూ కుల ధ్రువీకరణ సర్వే పనులు వేగవంతమయ్యేలా వీఆర్వోలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. ఆయా గ్రామాల్లోని వీఆర్వోలు ఇంటింటి సర్వేతో పాటు కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరించి వీఆర్వో లాగిన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కుల ధ్రువీకరణ పత్రానికి సంబంధించి ఆధార్‌ను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 8 వేల ఆన్‌లైన్ నమోదు చేసినట్లు తెలిపారు. సెప్టెంబరు నాటికి నూరుశాతం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. అక్టోబరు నెలలో ఈసేవలు ప్రారంభం అవుతాయన్నారు. గ్రామసచివాలయానికి వెళ్లి ఆధార్ నంబరు నకలు కాపీను అందజేస్తే సత్వరమే కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారన్నారు. అలాగే రీసర్వే పూర్తి అయిన రెవెన్యూ గ్రామాలు పోట్లూరు, పిచికలపాలెం, వేల్పూరు, కనమర్లపూడి గ్రామాలకు త్వరలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామని ఇందుకుగాను 7535 పాసు పుస్తకాలు తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నట్లు తెలిపారు.

నులిపురుగుల నిర్మూలన లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ఆర్బీఎస్‌కే జిల్లా అధికారి రాజేశ్వరి

క్రోసూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆర్బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) జిల్లా అధికారి రాజేశ్వరి కోరారు. ఈ నెల 12న జరిగిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం మ్యాప్ అప్ సందర్భంగా ఆమె క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె హెచ్‌ఎం బాబురావును విద్యార్థులందరికీ నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేసారా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలం మొత్తంలో మిగిలిపోయిన 549 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించటం జరిగిందన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమం విజయవంతం చేసిన పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, ఆర్బీఎస్‌కే సూపర్‌వైజర్ కరిముల్లా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ సుహాసిని
- నామమాత్రంగా సర్వసభ్య సమావేశం
- డుమ్మా కొట్టిన కొన్ని శాఖలు అధికారులు

శావల్యాపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో ప్రజలను అధికారులు చైతన్యం పెంపొందించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అధికారులు వారధిగా ఉంటూ అర్హత కల్గియున్న వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. వేల్పూరు ఎంపీటీసీ సభ్యురాలు లింగా పున్నమ్మ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో డీఏపీ ఎరువు కట్టలు రైతులు అడిగినన్ని ఇవ్వటం లేదని కేవలం ఐదు కట్టలు మాత్రమే ఇస్తున్నట్లు అన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కూడా రైతులకు పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందన్నారు. అలాగే గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన ఓవర్‌హెడ్ ట్యాంకుకు ఉన్న నిచ్చెన విరిగిపోవటం వలన శుభ్రం చేయకపోవటంతో తాగునీరు దుర్వాసన వెదజల్లుతున్నందన్నారు. వేల్పూరు నుంచి వెలమవారిపాలెం గ్రామానికి వెళ్లే రహదారి మార్గం కొన్ని సంవత్సరాల నుంచి అధ్వానంగా ఉందని దీంతో వాహనాలు బైకులు రాకపోకలకు తీబ్బందులు పడుతున్నారని పట్టించుకునే నాధుడే లేదని వాపోయారు. గ్రామంలో ఉన్న ప్రధాన



మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసి

ఎంపీపీ స్కూలు, జడ్పీ ఉన్నత పాఠశాల్లో ప్రహరీ నిర్మాణాలు చేపట్టాలన్నారు.

అలాగే వేల్పూరు గ్రామపంచాయతీకు శాశ్వత పంచాయతీ సెక్రెటరీ నియామకం లేకపోవటంతో మౌలిక వసతులు అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో జరగటం లేదన్నారు. మండలంలోని చినకంచర్ల గ్రామం ఎంపీయూపీ స్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో పి.సుగుణ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆన్‌లైన్ విధానంలో ఇంటి పన్నులు చెల్లింపులు జరుగుతాయని రోదులు కూడా పంచాయతీ కార్యదర్శులు అందజేస్తారన్నారు. సర్వసభ్య సమావేశానికి నామమాత్రంగా అధికారులు ప్రజాప్రతినిధులు హజరు కావటం పరిపాటిగా మారింది. ఈసమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, సీడీపీవో లక్ష్మి, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, కోఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫ్రైడేను డ్రైడేగా పాటించండి

నరసరావుపేట: దోమలు వలన వచ్చే మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధులు రాకుండా ప్రజలు బాధ్యతగా ప్రతి శుక్రవారంను ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ సూచించారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ 1893లో సర్ డాక్టర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటిషర్ ఈ మలేరియా వ్యాధి ప్యారసైట్ వల్ల వ్యాపిస్తుందని ప్రయోగ పూర్వకంగా నిరూపించారన్నారు. అందుకుగాను ఆయన 1902లో ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ అవార్డు పొందారన్నారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలలోని నిలువ ఉన్న నీటిని తొలగించి ఇంటి లోపల కూలర్లు, ఫ్రిడ్జ్ వెనకాల ఉండే వేస్ట్ వాటర్‌ను గమనించి నిలువ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, కుంచాల శీను పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: దోమకాటు వలన ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సాయిశ్వేత చెప్పారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ దోమల



ర్యాలీని ఆరంభిస్తున్న అధికారులు

దినోత్సవం నిర్వహించారు. రాత్రివేళల్లో దోమతెరలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి పి.కమల, సిబ్బంది నారాయణ, ఆగ్నేశమ్మ, శ్రీను, భవాని, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: దోమల నివారణతో వ్యాధులను నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్‌సీహెచ్ నారాయణ చెప్పారు. ప్రపంచ దోమల నివారణ దినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల వద్ద అవగాహన సదస్సులు, ర్యాలీ బుధవారం నిర్వహించారు. నిల్వ ఉన్న మంచినీటిపై మూతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుభాని, శివయ్య, కోటేశ్వరరావు, జిలాని, పీర్, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అల్లర్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోండి



నరసరావుపేట రూరల్: గ్రామంలో దాడులకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఈపూరు మండలం ఊడిజర్ల పంచాయతీ పరిధిలోని నల్లగొండ తండావాసులు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావును కోరారు. జిల్లా పోలీసు ప్రధానకార్యాలయంలో బుధవారం ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వాసులు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న తమ గ్రామంలో కొంత కాలంగా కొంతమంది అల్లర్లు సృష్టిస్తున్నారని తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



నరసరావుపేట: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ గాంధీ చిత్రపటం ముందు కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. పాస్టర్ల సంఘం సభ్యులు, పీసీసీ డెలిగేట్ సీదా కృష్ణారావు, ఎం.ప్రవీణ్, ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు ఇమ్మానుయేల్, పూర్ణచంద్రరావు, ప్రసాద్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శాస్త్రీయ దృక్పథ దినోత్సవం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి స్థానిక అధ్యక్షుడు ధూళిపాళ వెంకట్రావు మాట్లాడుతూ మూఢ నమ్మకాల నిర్మూలన కోసం నిరంతరం కృషి చేసిన పద్మశ్రీ డాక్టర్ నరేంద్ర అచ్యుత్ దోబోల్కర్ వర్ధంతిని దేశవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథ దినోత్సవంగా పాటిస్తున్నారని తెలిపారు. కార్యదర్శి అజయ్‌బాబు, డాక్టర్ దార్ల బుజ్జిబాబు, చుక్కా విన్సెంట్ పాల్, షేక్ దాదా, షేక్ కరీముల్లా, పాఠశాల ప్రిన్సిపాల్ అంజన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూలు శిక్షణలో చేరండి

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూలులో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణా కేంద్రం ద్వారా ఇప్పటివరకు 20 బ్యాచ్‌లకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వటం జరిగిందన్నారు. 21వ బ్యాచ్ వారం రోజుల్లో ప్రారంభమౌతుందన్నారు. తమ వద్ద శిక్షణ పొందిన వారికి మంచి కంపెనీలలో ఉద్యోగాలు పొందారన్నారు. అందువలన తమ ట్రైనింగ్ స్కూలులో శిక్షణ తీసుకోవాలని, ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9959225428ను సంప్రదించాలని కోరారు.

స్ఫూర్తి సభకు రావాలి

నరసరావుపేట: సంచార, అర్ధ సంచార జాతుల అభివృద్ధి కోసం మాజీ ప్రధాని వాజపేయ్ తర్వాత ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక సంకల్పంతో కృషిచేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ప్రకాష్‌నగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ అధ్యక్షతన ఆగష్టు 30న సంచార, అర్ధ సంచార జాతుల అభివృద్ధి కోసం విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ నేతృత్వంలో నిర్వహించే భారీ భహిరంగ సభ గురించి చర్చించారు. ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతరావు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు కామినీడి హనుమంతరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు



బొల్లాపల్లి: పారిశుద్ధ్యం మెరుగు పరచేందుకు కృషి చేయాలని నర్సరావుపేట డి.ఎల్.పి.ఓ.వి వి.ఎం లక్ష్మణరావు అన్నారు. మండలంలోని రెడ్డిపాలెం గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

23న సంస్మరణ సభ జయప్రదం చేయండి

నరసరావుపేట: ఒంగోలు ఎల్బీజీ భవన్‌లో 23న నిర్వహించే పీడీఎం వ్యవస్థాపక సభ్యులు కామ్రేడ్ కనకాచారి 20వ సంస్మరణ సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో కరపత్రం ఆవిష్కరించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టరు ఆవిష్కరణ

నరసరావుపేట ఈస్ట్: ఒంగోలులో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ ఏరియా కార్యదర్శి సి.హెచ్.సత్యనారాయణరాజు తెలిపారు. మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం పట్టణంలోని 1వవార్డు పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కార్యాచరణను మహాసభలలో ప్రకటిస్తారని తెలిపారు.